PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 351 పేజీలు - 08 శనివారం 14 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

- 15 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులు అందజేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



తొలి అక్షరం/న్యూఢిల్లీ,నవంబర్ 13: క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కోచ్‌లకు అందించే జాతీయ క్రీడా పురస్కారాలు-2025 ప్రదానోత్సవం శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు అవార్డులు అందజేసి సత్కరించారు. మొత్తం 15 మంది క్రీడాకారులు అర్జున అవార్డులు అందుకున్నారు.డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, ఫిడే మిగతా2లో...

తెలంగాణను పెట్టుబడుల కేంద్రంగా

తీర్చిదిద్దడమే లక్ష్యం

- యువతకు ఉపాధి అవకాశాల కల్పనే భారత్ సమ్మిట్ ఉద్దేశం
- 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధుల రాక
- వీసాల నిరాకరణపై కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: తెలంగాణను పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్ది, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడమే భారత్ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. భారత్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న ప్రతినిధుల వీసాలను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ చర్యకు బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు.భారత్ సమ్మిట్‌కు 70 దేశాల నుంచి సుమారు వెయ్యి మంది ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. వివిధ రంగాలకు మిగతా2లో...



ప్రపంచ ప్రగతిశీల నేతల వేదికగా

హైదరాబాద్

హెచ్‌ఐసీసీలో భారత్ సమ్మిట్-2.0 సందడి

70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు

ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, వాతావరణ మార్పులపై చర్చలు

నేడు ముగింపు సమావేశంలో రాహుల్‌గాంధీ ప్రసంగం

తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్య విలువలు, ఆర్థిక సహకారం, సామాజిక న్యాయం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు హైదరాబాద్ వేదికగా భారత్ సమ్మిట్-2.0 శుక్రవారం ప్రారంభమైంది. హెచ్‌ఐసీసీలో రెండు రోజులపాటు జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు భారత్‌తో పాటు సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా మిగతా2లో...

ఎంఓయులు ఆచరణలోకి రావాలి

సీఐఐ సదస్సు ముగింపులో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: పెట్టుబడులు కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా ఆచరణ రూపం దాల్చాలని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. 'కలిసి పనిచేద్దాం.. కలిసి ఎదుగుదాం.. సంపదను పంచుకుందాం' అనే విధానంతో ముందుకు సాగాలని సూచించారు. విశాఖలో రెండు రోజుల పాటు మిగతా2లో...

రూ.3 లక్షల కోట్లతో ఏపీలో రహదారుల అభివృద్ధి

- సీఐఐ సదస్సులో వెల్లడించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.3 లక్షల కోట్లతో రహదారి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 2014లో రాష్ట్రంలో 4,100 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ ప్రస్తుతం 8,700 కిలోమీటర్లకు పెరిగిందన్నారు. రూ.14 వేల కోట్లతో మిగతా2లో...

భావితరాల భవిష్యత్తు కోసమే

భారత్ ఫ్యూచర్ సిటీ

- సుస్థిరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం
- పెట్టుబడులకు అన్ని విధాలా సహకరిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: భావితరాల అవసరాలకు అనుగుణంగా సుస్థిరాభివృద్ధికి పెద్దపీట వేస్తూ భారత్ ఫ్యూచర్ సిటీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణతో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేలా నెట్‌జీరో లక్ష్యంతో పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. భారత్ సమ్మిట్-2.0లో భాగంగా హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన 'ఫ్యూచర్ సిటీ-పట్టణీకరణ' చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలు మిగతా2లో...

నగర భద్రతకు పెద్దపీట.. కొత్త సీపీ మహేష్ భగవత్

శాంతిభద్రతలు, మహిళా రక్షణ, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

నేరస్తులపై కఠిన చర్యలు.. అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు



నీటి లభ్యత ఆధారంగా యాసంగి పంటల ఎంపిక

- జిల్లాల వారీగా పకడ్బందీ సాగు ప్రణాళిక రూపొందించాలి
- విత్తనాలు ముందుగానే సిద్ధం చేయాలి
- కూరగాయలు, పప్పుధాన్యాల సాగుకు ప్రోత్సాహం
- కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: రాష్ట్రంలో రబీ పంటల సాగు ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రతి జిల్లాలో స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా అనువైన పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి సీనియర్ అధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయం, ఉద్యానవన శాఖ, సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం, కూరగాయలు, పప్పుధాన్యాల సాగు, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటి లభ్యత ఆధారంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేసి సకాలంలో అందు బాటులో ఉంచాలని ఆదేశించారు. కూరగాయ లు, పప్పుధాన్యాల సాగును మిగతా2లో...

మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్

ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని ఆరోపణలు

నా దగ్గర ఆధారాలున్నాయి.. ముఖాముఖి చర్చకు సిద్ధం

కాంగ్రెస్ నేత వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలన్నీ ఫోన్‌లోనే ఉన్నాయని వెల్లడించారు. శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో నిర్వహించిన 'ఆస్క్ మీ' కార్యక్రమంలో నెటిజన్ల ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను పైకెత్తి చూపిస్తూ, తనపై నిఘా ఉన్న విషయం ప్రధానికి కూడా తెలుసని పేర్కొన్నారు.ప్రధాని మోదీ మిగతా2లో...

సిద్దిపేటలో రాజకీయ సమరానికి కవిత సన్నద్ధం!

హరీశ్‌రావును ప్రజాజీవితం నుంచి తరిమికొట్టే వరకు పోరాటం

మున్సిపల్ ఎన్నికల నుంచే కార్యాచరణ ప్రారంభం

కాళేశ్వరం, మల్లన్నసాగర్ పనులపై తీవ్ర ఆరోపణలు



తెలంగాణను పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

చెందిన నిపుణులు, ప్రముఖులు, జర్నలిస్టులను ఆహ్వానించి రెండు రోజులపాటు చర్చలు, సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక విధానాలు, వాతావరణ పరిస్థితులు, మౌలిక వసతులు, మానవ వనరులను అంతర్జాతీయ ప్రతినిధులకు వివరించడమే ఈ సమావేశాల ఉద్దేశమన్నారు. ఇక్కడికి వచ్చిన ప్రతినిధులు తిరిగి తమ దేశాలకు వెళ్లిన తర్వాత తెలంగాణకు ప్రచారకర్తలుగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.బీజేపీని వ్యతిరేకిస్తే దేశాన్ని వ్యతిరేకించినట్లు కాదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై దేశద్రోహులనే ముద్ర వేయడం సరైంది కాదన్నారు. భారత్ సమ్మిట్ దేశ వ్యతిరేక సమావేశమంటూ బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాల కోసం తీసుకునే ప్రతి నిర్ణయాన్నీ గుడ్డిగా వ్యతిరేకించడం తగదని హితవు పలికారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు చర్చలే మార్గమని పేర్కొన్నారు.డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు సీఎం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీ, బెంగళూరు, చెన్నైలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించామని, త్వరలో ముంబయి, అహ్మదాబాద్‌లోనూ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మూడు ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చడం, యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.రాష్ట్రంలో గిగ్ వర్కర్ల విధానాన్ని శనివారం నుంచి అమలు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. ఆయన రాకను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వివాదం చేయడాన్ని తప్పుబట్టారు. రాహుల్‌గాంధీ భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొంటే అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు.సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ భారత్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ప్రపంచ దేశాల మధ్య సహకారం, శాంతి, వాతావరణ మార్పులపై ఉమ్మడి కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రగతిశీల నేతల వేదికగా హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ దేశాల రాజకీయ నాయకులు, మంత్రులు, మాజీ మంత్రులు, పార్లమెంటు సభ్యులు, మేధావులు, విధాన రూపకర్తలు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు.'ఫోర్జింగ్ ఏ న్యూ వరల్డ్' (నూతన ప్రపంచ నిర్మాణం) ఇతివృత్తంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై చర్చలు జరగనున్నాయి. కృత్రిమ మేధ, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, యువత రాజకీయ భాగస్వామ్యం, మహిళా సాధికారత, లింగ సమానత్వం, మీడియా భవిష్యత్తు, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలు ప్రధాన చర్చనీయాంశాలుగా ఉన్నాయి. ప్రపంచ దేశాల మధ్య సహకారం, శాంతి, ప్రజాస్వామ్య పరిరక్షణకు అవసరమైన ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనపై ప్రతినిధులు అభిప్రాయాలు పంచుకోనున్నారు. **తెలంగాణ అభివృద్ధిపై ప్రత్యేక చర్చలు** సదస్సులో భాగంగా తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన తొమ్మిది ప్రత్యేక చర్చాగోష్ఠులు నిర్వహిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ, పట్టణీకరణ, ఆర్థిక న్యాయం, సామాజిక న్యాయం, సంక్షేమ విధానాలు, సహకార సమాఖ్యవాదం, సంస్కృతి, యువత, క్రీడలు, రాజకీయాలు, ఎన్నికల సమగ్రత వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. **నేడు రాహుల్‌గాంధీ ప్రసంగం** శనివారం జరిగే ముగింపు సమావేశంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రసంగించనున్నారు. భారత్ భవిష్యత్తు, ప్రపంచ రాజకీయ పరిణామాలు, విదేశాంగ విధానం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, శాంతియుత సహజీవనం, ప్రజాస్వామ్య విలువలపై తన అభిప్రాయాలను వెల్లడించనున్నారు. సదస్సు ద్వారా హైదరాబాద్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

భావితరాల భవిష్యత్తు కోసమే భారత్ ఫ్యూచర్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదకశక్తులుగా నిలిచాయని, మారుతున్న ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేర్చాలనే లక్ష్య సాధనలో ఈ నగరం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కేవలం పారిశ్రామిక ప్రాంతంగా కాకుండా ప్రజలు నివసించేందుకు, పనిచేసేందుకు, చదువుకునేందుకు, పరిశోధనలు చేసేందుకు, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దుతామని వివరించారు.వర్షపు నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగం, సౌర విద్యుత్, పచ్చదనం, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు.

కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, వైద్య ఆరోగ్యం, ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు, డేటా కేంద్రాలు, అంతరిక్ష సాంకేతికత, అధునాతన తయారీ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాల నేపథ్యంలో అమెజాన్, హైపర్‌వాల్ట్, కంట్రోల్ఎస్, మారుబెనీ, సెమ్‌కార్ప్, ఎన్‌టిటి వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు.భారత్ ఫ్యూచర్ సిటీని దేశ పారిశ్రామిక, పట్టణాభివృద్ధికి కొత్త నమూనాగా తీర్చిదిద్దుతామని శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆహ్వానించారు.

భూ కేటాయింపుల నుంచి పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుమతుల వరకు అన్ని దశల్లోనూ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. చర్చాగోష్ఠిలో రాజీవ్ గాంధీ ఫౌండేషన్ సీఈవో విజయ్ మహాజన్, పట్టణాభివృద్ధి నిపుణుడు టికేందర్ సింగ్ పవార్, షేక్ సలావుద్దీన్, చరిత్రకారుడు సజ్జద్ షాహిద్, మాజీ ఎంపీ దివ్య స్పందన తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటలో రాజకీయ సమరానికి కవిత సన్నద్ధం!

తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: సిద్దిపేట ప్రజలకు రాజకీయ స్వాతంత్ర్యం తీసుకొస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. హరీశ్‌రావు అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఆయనను ప్రజాజీవితం నుంచి తప్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు. శుక్రవారం సిద్దిపేటలో తెలంగాణ రక్షణ సేన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేసిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.సిద్దిపేట తన సొంత గడ్డని, తెలంగాణ ఉద్యమానికి ఈ ప్రాంతం ఎంతో సహకరించిందని కవిత గుర్తుచేశారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం తాను చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. సిద్దిపేటలో మున్సిపల్ ఎన్నికల నుంచే తమ రాజకీయ పోరాటం ప్రారంభమవుతుందని, అక్కడ తమ పార్టీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి మెదక్ జిల్లాకు రావాల్సిన నీరు అందడం లేదని విమర్శించారు. సుమారు రూ.93 వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో సాగునీరు అందలేదని ఆరోపించారు. మల్లన్నసాగర్, కొండ పోచమ్మ సాగర్ నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వలేదని, రంగనాయకసాగర్ వద్ద భూములకు పరిహారం తీసుకుని హరీశ్‌రావు గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారని ఆరోపించారు.మల్లన్నసాగర్ రిజర్వాయర్ భద్రతపై ఎన్‌జీఆర్ఐ గతంలోనే నివేదిక ఇచ్చిందని, అయినా తగిన జాగ్రత్తలు తీసుకోలేదని కవిత అన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ బండ్ వద్ద లీకేజీలు వస్తున్నాయని, వాటిని కప్పిపుచ్చేందుకు బ్లాస్టింగ్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శిం చారు. ఈ అంశంపై ఈ నెల 19న సిద్దిపేటకు రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.హరీశ్‌రావు ఆరోగ్య మంత్రిగా ఉన్న సమయంలో నిమ్స్‌లో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, రూ.25 కోట్ల ఈపీఎఫ్ నిధులను ఇతర ఖాతాలకు మళ్లించారని కవిత ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరారు. సిద్దిపేటలో రైస్‌మిల్లుల సంఖ్య తగ్గిపోవడం, స్థానిక వ్యాపారాలు దెబ్బతినడం, గండిపల్లి రిజర్వాయర్ నిర్మాణం పెండింగ్‌లో ఉండటంపై కూడా ఆమె విమర్శలు చేశారు. తాము అధికారంలోకి వస్తే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని తెలిపారు.

నీటి లభ్యత ఆధారంగా యాసంగి పంటల ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతంగా ప్రోత్సహించాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను గరిష్ఠంగా వినియోగించుకుని సాగు విస్తీర్ణం, దిగుబడులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నీటి పొదుపు కోసం సూక్ష్మ సేద్యం, ముఖ్యంగా బిందు సేద్యం విధానాన్ని విస్తరించాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు.భూసేకరణ సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పాఠశాలలను తరచూ సందర్శించి విద్యా కార్యక్రమాలు, విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, బోధనా ప్రమాణాలను పరిశీలించాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

- ఈ నెల 19న సిద్దిపేటలో పథకం ప్రారంభం
- 20 నుంచి 30 వరకు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ
- ఇందిరమ్మ చీరల పంపిణీకి అదే రోజు శ్రీకారం

తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించే భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే వేదికగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాల యంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పథకానికి సంబంధించిన దరఖాస్తులను నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో సేకరించనున్నారు. ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాయి. అనంతరం వాటిని తహసీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేస్తారు.

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించడమే ఈ పథకం ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది. కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ పథకం దోహదపడుతుందని పేర్కొంది.ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా పూర్తయిన 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని లబ్ధిదారులతో కలిసి వేడుకల్లో పాల్గొననున్నారు.

ఎంఒయులు ఆచరణలోకి రావాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2024 జూన్ నుంచి ఆంధ్రప్రదేశ్ రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం విశేషమన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ ఏపీ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, ఎలక్ట్రానిక్స్, అంతరిక్ష, రక్షణ, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాలన, పౌర సేవల్లో కృత్రిమ మేధ వినియోగాన్ని అభినందించారు.**ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు విశ్వాసం**సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం కావడం ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.**రూ.32 లక్షల కోట్ల పెట్టుబడులు ఆచరణ దిశగా**ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పునరుద్ధరించామని, భోగాపురం విమానాశ్రయం, రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యమన్నారు. 2024 నుంచి వచ్చిన 714 ఎంఒయూల ప్రతిపాదనల్లో 522 ఆచరణ దిశగా ఉన్నాయని వెల్లడించారు. కియా సంస్థ అదనంగా రెండు లక్షల కార్ల తయారీ కోసం రూ.18,878 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చిందని, రిలయన్స్ రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుందని తెలిపారు.**రెండో రోజు 12 ఒప్పందాలు**సదస్సు రెండో రోజైన శుక్రవారం వివిధ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో 12 ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వీటి ద్వారా రూ.1,41,585 కోట్ల పెట్టుబడులు, 10,919 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జిందాల్ గ్రూప్ కందుకూరులో రూ.15 వేల కోట్లతో మైనింగ్ కార్యకలాపాలు చేపట్టనుంది. అగ్నికుల్ కాస్మోస్ తిరుపతిలో డేటా కేంద్రం, రాకెట్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయనుంది. గ్రీన్ జెన్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. డిక్సన్ టెక్నాలజీస్, ఎయిర్‌ట్రంక్-జేసీకే ఇన్‌ఫ్రా, కాకినాడ సీపోర్ట్స్ తదితర సంస్థలు కూడా వివిధ ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్, సీఐఐ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రూ.3 లక్షల కోట్లతో ఏపీలో రహదారుల అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మిస్తున్న బెంగళూరుకడపవిజయవాడ గ్రీన్‌ఫీల్డ్ కారిడార్‌ను 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి తెస్తామని తెలిపారు. రూ.16 వేల కోట్లతో చేపట్టిన రాయ్‌పూర్‌విశాఖపట్నం కారిడార్ 2027 నాటికి పూర్తవుతుందని పేర్కొన్నారు.

దీంతో ప్రయాణ సమయం 13 గంటల నుంచి ఐదు గంటలకు తగ్గుతుందన్నారు. హైదరాబాద్‌విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి ని రూ.12 వేల కోట్లతో ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించా రు. ఖరగ్‌పూర్‌విశాఖపట్నం అమరావతి కారిడార్‌కు రూ.71 వేల కోట్లు, అమరావతి చుట్టూ 190 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రూ.32 వేల కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు.

ఘనంగా జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానం

(మొదటి పేజీ తరువాయి)

మహిళల ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ అర్జున అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. వీరితో పాటు అథ్లెట్ మహమ్మద్ అజ్మల్, బాక్సర్ నరేందర్, చెస్ క్రీడాకారుడు విదిత్ గుజరాతి, హాకీ క్రీడాకారులు లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ పురస్కారాలు అందుకున్నారు.

సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు యెషయా అరుమైనియాగంకు అర్జున అవార్డు (జీవితకాల సాఫల్యం) ప్రదానం చేశారు. అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్‌లు ఛోటే లాల్ యాదవ్, ధర్మేంద్ర సింగ్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్, రెజ్లింగ్ కోచ్ వీరేంద్ర కుమార్‌లకు ద్రోణాచార్య అవార్డులు అందజేశారు. టెన్జింగ్ నార్గే జాతీయ సాహస పురస్కారం, పుణెలోని ఆర్మీ పారాలింపిక్ నోడ్‌కు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం ప్రదానం చేశారు.ఈ ఏడాది ఆగస్టు 18న అవార్డు గ్రహీతల తుది జాబితాను ప్రకటించగా, వాయిదా పడిన పురస్కారాల ప్రదానోత్సవం తాజాగా నిర్వహించారు.

మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్

(మొదటి పేజీ తరువాయి)

తనతో ముఖాముఖి బహిరంగ చర్చకు రావాలని రాహుల్ మరోసారి సవాల్ విసిరారు. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరు ఉన్నారు? దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నది ఎవరు? అనే విషయాలు చర్చలో తేలుతాయని అన్నారు. ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని, ప్రధాని తనకు నచ్చిన వేదికను, న్యాయనిర్ణేతను ఎంపిక చేసుకోవచ్చని సూచించారు. టెలిప్రాంప్టర్ సహాయంతోనైనా చర్చకు రావచ్చని వ్యాఖ్యానించారు.పార్లమెంట్‌లో తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పలు కీలక అంశాలపై మాట్లాడుతున్న సమయంలో మైక్ నిలిపివేస్తున్నారని రాహుల్ విమర్శించారు. అందుకే ప్రజల సమక్షంలో నేరుగా చర్చ జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. తనతో చర్చకు వస్తే ప్రధాని రాజకీయ భవిష్యత్తు ముగుస్తుందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలను బీజేపీ నేతలు ఖండించారు. కేరళ బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేశారు. రాహుల్ ఫోన్‌ను ట్యాప్ చేయాల్సిన ఆసక్తి ఎవరికీ లేదని వ్యాఖ్యానించారు. అయితే, తన ఫోన్ ట్యాపింగ్ అవుతోందన్న ఆరోపణలకు రాహుల్ ఈ సందర్భంగా ఎలాంటి సాంకేతిక ఆధారాలను బహిరంగంగా వెల్లడించలేదు.ఢ

నగర భద్రతకు పెద్దపీట..

కొత్త సీపీ మహేష్ భగవత్


- శాంతిభద్రతలు, మహిళా రక్షణ, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి
- నేరస్తులపై కఠిన చర్యలు.. అక్రమ వసూళ్లకు పాల్పడితే కేసులు



తొలి అక్షరం/హైదరాబాద్, నవంబర్ 13: హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మహిళల భద్రతకు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నూతన పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో మాజీ సీపీ సజ్జనార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలో సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకుంటామని మహేష్ భగవత్ స్పష్టం చేశారు. భూముల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో భూ తగాదాలకు సంబంధించి దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. అనుభవజ్ఞులైన అధికారులతో కలిసి సమష్టిగా పనిచేస్తానన్నారు.తరచూ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచుతామని తెలిపారు. పోలీసులు ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రిమినల్ కేసులతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అగ్నికీలల బీభత్సం..పోలీసుల చొరవతో తప్పిన పెనుముప్పు

- షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఎగసిపడిన మంటలు
- ఫ్రిజ్, వాటర్ ప్యూరిఫైర్ సహా గృహోపకరణాలు దగ్ధం
- సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తెచ్చిన పోలీసులు





తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి(సాంబ పస్తం),నవంబర్13:తొర్రూరు పట్టణంలోని సాయినగర్ స్ట్రీట్ నంబర్ 6లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది.ఈ ఘటనలో ఇంట్లోని విలువైన గృహోపకరణాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..సాయినగర్‌కు చెందిన టి.నాగరాజు ఇంట్లో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి.క్షణాల్లోనే మంటలు వ్యాపించడంతో ఇంట్లోని ఫ్రిజ్, వాటర్ ప్యూరిఫైర్ మిషన్‌తో పాటు ఇతర గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి.ఇంట్లో నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అప్రమత్తమైన తొర్రూరు ఎస్సై మహేందర్ రెడ్డి, అదనపు ఎస్సై ఖాదర్ పాషా తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.పోలీసులు సకాలంలో స్పందించడంతో మంటలు పక్క ఇళ్లకు వ్యాపించకుండా పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పంచముఖ నాగేంద్ర స్వామి ఆలయంలో పాల్గొన్న భక్తులు

పంచముఖి నాగేంద్ర స్వామి ఆలయంలో ఘనంగా నాగుల చవితి వేడుకలు

పురాతన పుట్ట వద్ద మొక్కులు చెల్లించుకున్న మహిళలు భక్తులు



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) నవంబర్ 13: తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ప్రతి సంవత్సరం నాగుల చవితి వేడుకలు మున్సిపల్ పరిధిలో 10వ వార్డులో ఉన్న పుట్ట ఘనంగా జరుగుతాయి శుక్రవారం మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న పంచముఖ నాగేంద్ర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గోపారపు నాగేశ్వరరావు కల్లూరి నాగేంద్ర చారి లా ఆధ్వర్యంలోపంచముఖ నాగేంద్ర స్వామికి ఉదయం సుప్రభాత సేవ పంచామృతాల అభిషేకాలు భక్తులచే సామూహిక గోత్రం నామార్చనలు అర్చకులు ఓలేటి యాదిగిరి ఆచార్యులు ,గీతాచార్యులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహిళలు ఆలయాలకు కుటుంబాలతో సహా విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఆలయంలో ఉన్న జంట నాగుల విగ్రహం వద్ద రావి చెట్టుకు తమ కోరికలు తీరాలని ముడుపుల కడుతూ, కోరికలు తీరిన వారు ముడుపులు చెల్లించుకున్నారు ఆలయంలో జరిగిన అలంకరణ ,ప్రసాద వితరణ కు పూజా కార్యక్రమాలు ఏర్పాట్లకు గోపారపు గిరి ,కరుణశ్రీ, సాన్నిత్వయ శ్రీపాదరావు లు సహకరించారని నిర్వాహకులు గోపారపు నాగేశ్వరరావు చెప్పారు అదేవిధంగా పట్టణంలో 10వ వార్డులో ఉన్న ఎన్నో ఏళ్లుగా ఉన్న పురాతన నాగమయ్య పుట్ట వద్ద నాగుల చవితి పర్వదినం రోజున వేకువజాము నుంచే మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుట్ట వద్ద పసుపు కుంకుమలు, కోడిగుడ్లు, ఆవు పాలు, చలిమిడి ప్రసాదాలను నివేదిస్తూ కుటుంబాల్లో ఎలాంటి దోషాలు ఉన్న నివృత్తి చేయమని నాగేంద్రుని వేడుకున్నారు. నాగశ్రీదోషాలు నివృత్తి అయిన వారు, తమ పిల్లలకు సంతానాన్ని ప్రసాదించినందుకు తమ ముడుపులను చెల్లించుకున్నారు. పుట్ట వద్ద మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ పదో వార్డ్ కౌన్సిలర్ సురేష్ లు చక్కటి ఏర్పాట్లు చేసినందుకు భక్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు దార నాగ శివప్రసాద్ ,తేరాల నారాయణ, హరి హర క్షేత్రం అయ్యప్ప దేవాలయంలో కూడా నాగుల చవితి వేడుకలను ఆలయ నిర్వాహకులు దారం ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారి పుట్ట వద్ద అభిషేకాలు పూజా కార్యక్రమంలో నిర్వహించారు కార్యక్రమంలో బిజ్జాల వెంకటరమణ చంద్రకళ ,దారం లత ,మచ్చ సోమయ్య, పరమేశ్వర్, మాలదారులైన అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు.

ట్రినిటీ హైస్కూల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు!

- వివిధ వేషధారణల్లో అలరించిన చిన్నారులు.. బాలలకు విలువైన సందేశాలు అందించిన డాక్టర్ ఉజ్జిని మంజుల





తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 13: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ట్రినిటీ హైస్కూల్ ఐఐటీ జోన్‌లో శుక్రవారం ముందస్తుగా బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల వేషధారణల్లో హాజరై తమ ప్రతిభను చాటుతూ అందరినీ ఆకట్టుకున్నారు. చిన్నారుల సందడి, ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నవంబర్ 14న భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. నెహ్రూకు పిల్లలంటే అమితమైన ప్రేమ ఉండేదని, అందుకే ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని వివరించారు.విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, ప్రతి విషయాన్ని ఆసక్తితో నేర్చుకోవాలని, సమాజంలోని మంచి చెడులను గుర్తించి సరైన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ క్రమశిక్షణ, పట్టుదల, నైతిక విలువలతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిల్లలకు విలువైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ఐఐటీ ఇన్‌చార్జి అనుష, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి చందన, ఉపాధ్యాయులు జ్యోతి, శిరీష, ధనలక్ష్మి, హారిక, భార్గవి, లావణ్య, సింధు తదితరులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో తొలిసారిగా శివదీక్ష మాలధారణ

తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 13: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని చౌటుప్పల్ మండలంలో తొలిసారిగా శివదీక్ష మాలధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శివదీక్ష మాలలు ధరించి పరమశివుని ఆరాధనకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆదిమూలం శంకర్ గురుస్వామి మాట్లాడుతూ.. 41 రోజుల పాటు నియమనిష్ఠలతో శివదీక్ష చేపట్టడం వల్ల భక్తుల్లో భక్తిశ్రద్ధలు, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, మంచి నడవడిక పెంపొందుతాయని తెలిపారు. మాలధారణ ప్రజల్లో ఐక్యతాభావాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా భక్తులందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు వీరమల్ల దాసు గౌడ్, కుక్కల నరసింహ, శంకర్ నాయక్, దోర్నాల గజేందర్, ముప్పిడి కృష్ణ, శివస్వాములు పాల్గొన్నారు.

నల్లగొండ రైతు బహిరంగ సభను జయప్రదం చేయాలి



తొలి అక్షరం/చౌటుప్పల్, నవంబర్ 13:

ఈ నెల 15న నల్లగొండలో నిర్వహించే అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభల బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎం.డి. జహంగీర్ పిలుపునిచ్చారు.శుక్రవారం చౌటుప్పల్‌లోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో సీపీఎం మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడం, పోడు భూములకు పట్టాలు, కౌలు రైతులకు న్యాయం, పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సరఫరా కోసం రైతు సంఘం పోరాడుతోందన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ పనులు త్వరగా పూర్తి చేయాలని, డిండి ఎత్తిపోతల పథకం ద్వారా దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగునీరు అందించాలని, మూసీ ప్రాజెక్టును ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం దేశ సార్వభౌమత్వానికి, వ్యవసాయ రంగానికి విఘాతం కలిగించేలా ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో మూడు రైతు చట్టాల రద్దు కోసం రైతు సంఘం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు.సమావేశంలో సీపీఎం చౌటుప్పల్ మున్సిపల్ కమిటీ కార్యదర్శి గోశిక కరుణాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి. పాషా, బండారు నరసింహ, దండా అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యమనే పుస్తకంలో.. భవిష్యత్తు రాసే తొలి అక్షరం గురువు!

పిల్లల చిరునవ్వు వెనుక ఓ అందమైన ప్రపంచం ఉంటుంది.. వారి చిన్న కళ్లలో కనిపించే కలల వెనుక ఓ మహా భారతం ఉంటుంది!


గులాబీని గుండెలపై ధరించి.. చిన్నారుల నవ్వుల్లో దేశపు రేపటిని చూసిన మహనీయుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ. పిల్లల ప్రేమకు చిరునామాగా నిలిచిన చాచా నెహ్రూ జయంతి మనకు బాలల దినోత్సవం!

పిల్లలూ.. మీరు మట్టిలో మొలిచిన చిన్న మొక్కలు కాదు.. రేపటి ఆకాశానికి నీడనిచ్చే మహావృక్షాలు!

మీ చేతిలోని పెన్సిల్ ఒక చిన్న వస్తువు కావచ్చు.. కానీ అది మీ భవిష్యత్తును రాసే అద్భుతమైన ఆయుధం. మీ నోట పలికే ప్రశ్న చిన్నదే కావచ్చు.. కానీ అది ప్రపంచానికి కొత్త సమాధానాన్ని అందించవచ్చు!

ఒక ఉపాధ్యాయురాలిగా నా మనసులోని మాట ఒక్కటే.. నేను నేర్పేది అక్షరాలు మాత్రమే కాదు.. ఆ అక్షరాల వెనుక ఆత్మవిశ్వాసాన్ని నాటాలనుకుంటున్నాను. నేను చూపేది పాఠశాల దారి మాత్రమే కాదు.. జీవితంలో గెలుపు వైపు నడిచే మార్గాన్ని చూపాలనుకుంటున్నాను.

నా విద్యార్థుల విజయాల్లో నా పేరు వినిపించకపోయినా బాధలేదు.. వారి వ్యక్తిత్వంలో



నా బోధన కనిపిస్తే చాలు. వారు ఆకాశమంత ఎత్తుకు ఎదిగితే.. వారి తొలి అడుగుకు నేనే సాక్షినయ్యాననే ఆనందం చాలు!

గురువు వేసే అక్షరం విద్యార్థి జీవితంలో వెలుగవుతుంది.. విద్యార్థి సాధించే విజయం సమాజానికి మార్గమవుతుంది!

చాచా నెహ్రూ కలలుగన్న బాల భారతం కోసం.. ప్రతి చిన్నారి కలకు రెక్కలిద్దాం.. ప్రతి బాల్యానికి చిరునవ్వులిద్దాం.. ప్రతి హృదయంలో జ్ఞానదీపం వెలిగిద్దాం!

ఎందుకంటే.. పిల్లలు మన తరగతి గదిలో కూర్చున్న విద్యార్థులు మాత్రమే కాదు.. రేపటి భారతదేశం రాయబోయే అందమైన అక్షరాలు!

బాలలందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు.

- రచన/ ఆకుల రచన ఉపాధ్యాయురాలు
విశ్వజనిత్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, పర్వతగిరి



నల్లగొండ కిసాన్ సభలకు రైతులు కదలిరావాలి

నవంబర్ 15 నుంచి 18 వరకు 36వ జాతీయ మహాసభలు..
రైతుల హక్కుల సాధనకు వేదిక



తొలిఅక్షరం /నర్సింహులపేట నవంబర్ 13: రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నల్లగొండలో నిర్వహించనున్న 36వ అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలకు రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని మండల ప్రజాసంఘాల నాయకులు మందుల యాకూబ్, బానోతు సర్వన్, కందుకూరి సుధాకర్ పిలుపునిచ్చారు. నవంబర్ 15 నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఈ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించి, రైతాంగ హక్కుల సాధనకు అవసరమైన కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభలు వేదిక కానున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభం, పంటలకు గిట్టుబాటు ధరలు, రైతుల సంక్షేమం, వ్యవసాయ కార్మికుల సమస్యలపై మహాసభల్లో చర్చించనున్నట్లు వివరించారు. రైతాంగ ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్న ఈ జాతీయ మహాసభల్లో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎల్లయ్య, వెంకన్న, వీరయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ రైతు సంఘం మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలి



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 13: నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల బహిరంగ సభకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మునిపంపుల గ్రామంలో రైతులతో కలిసి భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. ఎర్రజెండాలు చేతబూని రైతు నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని కాపాడాలని, రైతుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. పరిసర గ్రామాల రైతులు, వ్యవసాయ కార్మికులు సభకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఇదే సభ విజయవంతం చేయాలని సిరిపురం గ్రామంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి గోడపత్రిక ఆవిష్కరించారు. నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో ఏర్పాటు చేసే వ్యవసాయ ఉత్పత్తులు, ఆధునిక యంత్రాల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, పలువురు నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులే అధికారులు.. ఉపాధ్యాయులు!

పెద్దనాగారం పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తొలిఅక్షరం/నర్సింహులపేట, నవంబర్ 13: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతోపాటు పరిపాలనా విధానాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవం పెద్దనాగారం ఉన్నత పాఠశాలలో సందడిగా సాగింది. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులే ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు, విద్యాశాఖ మంత్రి వంటి బాధ్యతలు చేపట్టి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యాశాఖ మంత్రిగా లునావత్ చరణ్, కలెక్టర్‌గా బాదావత్ ధనలక్ష్మి, డీఈఓగా అజ్మీర దీక్షా, ఎంఈఓగా మందుల సిరి చందన, ప్రధానోపాధ్యాయురాలిగా బోడ శ్రావణి వ్యవహరించారు. ఇతర విద్యార్థులు వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులు, పీఈటీలు, పీఏలు, కార్యాలయ సిబ్బంది పాత్రలు పోషిస్తూ పాఠశాల నిర్వహణలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ఒక్కరోజు ఉపాధ్యాయులు, అధికారులుగా వ్యవహరించడం కొత్త అనుభూతిని కలిగించిందన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన ప్రధానోపాధ్యాయురాలు ఎన్. జానకి సుమన, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉన్నతాధికారులుగా ఎదగడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పాత్రలు పోషించిన విద్యార్థులు తమ అనుభవాలను వివరిస్తూ.. విద్యార్థుల మనస్తత్వాలను అర్థం చేసుకొని బోధించడం, క్రమశిక్షణతో నడిపించడం, నైతిక విలువలు నేర్పించడం, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం ఎంతటి బాధ్యతతో కూడుకున్నదో ఈ కార్యక్రమం ద్వారా తెలుసుకున్నామని చెప్పారు. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, శ్రేయోభిలాషులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జానకి సుమన, ఉపాధ్యాయులు సికిందర్, లచ్చు, నాగేష్ నాయక్, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, బాల వేణు, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పాల రైతుకు నష్టాలే.. పాడి పరిశ్రమకు ఆదరణేది?

- తొలి అక్షరం ప్రత్యేక కథనం

తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 13: తెల్లవారుజామునే నిద్రలేచి పశువుల సంరక్షణ, పాలు పితకడం, పాల కేంద్రాలకు తరలించడం.. ఇదీ పాడి రైతుల రోజువారీ జీవితం. అయితే పెరిగిన పాల ఉత్పత్తికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాణా, మేత, మందుల ధరలు పెరగడంతో పాల ఉత్పత్తి ఖర్చు లీటరుకు రూ.38 నుంచి రూ.42 వరకు అవుతుండగా, డెయిరీలు చెల్లిస్తున్న ధర రూ.30 నుంచి రూ.35 మధ్యే ఉంటోంది. దీంతో ప్రతి లీటరుపై రైతులు నష్టపోతున్నారు. పాలలో కొవ్వు శాతం తక్కువగా ఉందనే కారణంతో ధర తగ్గించడం, కొలతల్లో మోసాలు జరుగుతున్నాయనే ఆరోపణలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. పశువులకు అనారోగ్యం కలిగితే సరైన సమయంలో వైద్యం అందక, ప్రైవేటు వైద్యుల కోసం వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పశు బీమా ఉన్నప్పటికీ పరిహారం పొందడం కష్టంగా మారిందని రైతులు చెబుతున్నారు. ఒకప్పుడు విజయ, కరీంనగర్, ముల్కనూర్ వంటి సహకార డెయిరీలు రైతులకు అండగా ఉండేవి. ప్రస్తుతం సహకార సంఘాలు బలహీనపడటంతో ప్రైవేటు డెయిరీల ఆధిపత్యం పెరిగింది. మొదట అధిక ధరలు ఇచ్చి రైతులను ఆకర్షించి, ఆ తర్వాత ధరలు తగ్గిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు పాడి పరిశ్రమలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళల శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం దక్కడం లేదు. పరిష్కారాలపై దృష్టి పెట్టాలి పాల ఉత్పత్తికి గిట్టుబాటు ధర కల్పించేందుకు లీటరుకు కనీసం రూ.45 మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. ప్రతి మండలంలో తక్కువ ధరకు దాణా, పచ్చిమేత అందించే కేంద్రాలు, గ్రామాల్లో పాల శీతలీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పెరుగు, నెయ్యి, పనీర్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వాలి. పశు బీమా ప్రక్రియను సులభతరం చేసి రైతులకు త్వరగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలి. పాడి రైతు బాగుంటేనే పల్లె ఆర్థికంగా బలపడుతుంది. పాలు అమ్మి కుటుంబాన్ని పోషిస్తూ, పిల్లలను చదివించాలనే రైతుల ఆశలు నెరవేరాలంటే ప్రభుత్వం, సహకార సంస్థలు పాడి రంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



సామూహిక పారిశుద్ధ్యానికి చైర్‌పర్సన్ శ్రీకారం





తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 13: చౌటుప్పల్ పట్టణ పరిశుభ్రతే లక్ష్యంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ వినూత్న పారిశుద్ధ్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పారిశుద్ధ్య పనుల్లో వేగం, నాణ్యత పెంచేందుకు మున్సిపాలిటీలోని కార్మికులందరినీ ఒకే వార్డులో నియమించి సామూహిక శుభ్రత పనులు చేపట్టే విధానాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా 14వ వార్డులో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో చైర్‌పర్సన్ స్థానిక కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్‌తో కలిసి పర్యటించి పనులను స్వయంగా పర్యవేక్షించారు. వీధులు, కాలనీలు, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ విధానాన్ని పట్టణంలోని అన్ని వార్డుల్లో దశలవారీగా అమలు చేస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలల భద్రతకు సర్పంచ్ ప్రత్యేక చొరవ





తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 13: పంతంగి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల భద్రత కోసం సర్పంచ్ శ్రీలత సుందర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలు, ఆస్తుల ధ్వంసం జరుగుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు ఆమె దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. గ్రామ దాతల సహకారంతో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. గ్రామానికి చెందిన దూడల జంగయ్య (యాదయ్య కుమారుడు) ఉచితంగా సీసీ కెమెరాలు అందజేయడంతో గురువారం వాటిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పాఠశాలల ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన దాత దూడల జంగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గురువారావు, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, శ్రీనివాస్, వార్డు సభ్యుడు సప్పిడి ప్రభాకర్ రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ మాదగోని రమణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు బల్ల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ.. వృథాగా పోతున్న తాగునీరు

- ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



తొలి అక్షరం/నర్సింహులపేట నవంబర్ 13: మండలంలోని రూప్ల తండ గ్రామపంచాయతీ పరిధి మధు తండాలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. పైపులైన్ నుంచి నీరు నిరంతరం లీకవుతున్నా మరమ్మతులు చేపట్టే వారు కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా సర్పంచ్, గ్రామ కార్యదర్శి స్పందించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు తాగునీరు అందించాల్సిన పైపులైన్ నుంచి నీరు వృథాగా పోతుండటంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కుంకుడు పాములలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్13: రామన్నపేట మండలం కుంకుడు పాముల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం నాతి మంగమ్మఎల్లయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో, నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం సహకారంతో ఈ ఇల్లు మంజూరై నిర్మాణం పూర్తయింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాతి పరశురాములు గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి, గుమ్మడికాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించారు. అనంతరం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుంకి లక్ష్మీపతి, మల్లయ్య, సంకటి విష్ణు, నాతి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతన్నను నిలువునా ముంచుతున్న మొక్కజొన్న సీడ్ కంపెనీ ఏజెంట్లు



గతేడాది పంట డబ్బులే దిక్కులేవు.. మళ్లీ కొత్త విత్తనాల వ్యాపారానికి తెరలేపారు!

బాండ్లు లేవు.. ఒప్పందాలు లేవు.. చెల్లింపులకు గ్యారంటీ లేదు!

ఏజెంట్ల మాయమాటలకు రైతులు బలి.. కంపెనీలకు అధికారుల అండ ఉందా?

రైతు కష్టాన్ని వ్యాపారంగా మార్చుకుంటున్నారా? గత బకాయిలు తేల్చకుండా కొత్త పంపిణీకి అనుమతి ఎలా?

తొలి అక్షరం /ఏన్మూర్ నవంబర్ 13: ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్మూరు మండలంలో సీడ్ మొక్కజొన్న విత్తనాల పంపిణీ జోరుగా సాగుతోంది. గ్రామాల వెంట తిరుగుతున్న కంపెనీల ఏజెంట్లు రైతులకు రకరకాల ఆశలు చూపిస్తూ విత్తనాలు అంటగడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధిక దిగుబడులు వస్తాయని, పంట కొనుగోలుకు ఇబ్బందులు ఉండవని, మంచి ఆదాయం పొందవచ్చని నమ్మబలుకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కానీ గత ఏడాది ఇదే తరహాలో సాగు చేసిన రైతులకు సంబంధించిన పంట డబ్బులు ఇంకా పూర్తిస్థాయిలో అందలేదనే ఆరోపణలు ఉండటం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత ఏడాది రైతులకు ఇచ్చిన హామీలే నెరవేర్చని కంపెనీలు మళ్లీ ఏ ముఖంతో విత్తనాల పంపిణీ చేపడుతున్నాయనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. **విత్తనాలు ఇచ్చేటప్పుడు హామీలు.. పంట చేతికొస్తే ముఖం చాటేస్తారా?**సీడ్ మొక్కజొన్న సాగు విషయంలో కంపెనీల ఏజెంట్లు రైతులకు మౌఖిక హామీలు ఇస్తున్నారే తప్ప, పంట కొనుగోలు ధర, దిగుబడి ప్రమాణాలు, చెల్లింపుల గడువు, నష్టపరిహారం వంటి అంశాలపై స్పష్టమైన రాతపూర్వక ఒప్పందాలు ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా రైతులకు ఎలాంటి బాండ్లు ఇవ్వకుండా కేవలం ఏజెంట్ల మాటలపైనే సాగు చేయాలని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. విత్తనాలు అమ్ముకునే సమయంలో రైతుల చుట్టూ తిరిగే ఏజెంట్లు, పంట చేతికొచ్చి డబ్బులు చెల్లించే సమయానికి అందుబాటులో ఉంటారా? ఒకవేళ కంపెనీ కొనుగోలుకు నిరాకరిస్తే రైతు పరిస్థితి ఏమిటి? నష్టానికి బాధ్యత ఎవరు వహిస్తారు?**పాత బకాయిలు చెల్లించకుండా కొత్త వ్యాపారమా?**గత ఏడాది సీడ్ మొక్కజొన్న సాగు చేసిన రైతులకు చెల్లించాల్సిన డబ్బులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ బకాయిలపై స్పష్టత ఇవ్వకుండా, రైతులకు న్యాయం చేయకుండా మళ్లీ కొత్త సీజన్‌కు విత్తనాల పంపిణీ చేపట్టడం వెనుక కంపెనీల ఉద్దేశం ఏమిటి? గత ఏడాది పంటకు సంబంధించిన లెక్కలు తేల్చకుండా ఈ ఏడాది మళ్లీ రైతులను సాగులోకి దించడం ఎంతవరకు సమంజసం? రైతు పెట్టుబడి పెట్టాలి.. భూమి ఇవ్వాలి.. పగలు రాత్రి కష్టపడాలి.. చివరకు పంట డబ్బుల కోసం కంపెనీల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఎందుకు? రైతుల శ్రమకు విలువ లేదా?

అధికారులకు తెలియకుండానే సాగుతున్న పంపిణీనా?

మండలవ్యాప్తంగా విత్తనాల పంపిణీ జరుగుతున్నా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏయే కంపెనీలు విత్తనాలు పంపిణీ చేస్తున్నాయి? వాటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా? ఏజెంట్లకు అధికారిక గుర్తింపు ఉందా? రైతులతో ఎలాంటి ఒప్పందాలు చేసుకుంటున్నారు? గత ఏడాది రైతులకు చెల్లించాల్సిన బకాయిలపై విచారణ జరిగిందా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకుండానే ఇంత పెద్ద ఎత్తున విత్తనాల పంపిణీ జరుగుతోందా? లేక అన్నీ తెలిసి కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారుల ప్రమేయం ఉందనే ఆరోపణలకు ఇప్పటివరకు నిర్ధారిత ఆధారాలు లేవు.వ్యవసాయాన్ని నమ్ముకుని అప్పులు చేసి సాగు చేసే రైతన్నకు కంపెనీల మౌఖిక హామీలు రక్షణ కల్పించలేవు. విత్తనాలు పంపిణీ చేసే ముందు కంపెనీల నుంచి రాతపూర్వక ఒప్పందాలు తీసుకోవాలి. గత ఏడాది పెండింగ్‌లో ఉన్న చెల్లింపులపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలి. కంపెనీలు, ఏజెంట్ల వివరాలను సేకరించి వారి బాధ్యతలను నిర్ధారించాలి. రైతులకు నష్టం జరిగితే బాధ్యత వహించే విధంగా చర్యలు తీసుకోవాలి.ఒకవైపు రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే.. మరోవైపు కంపెనీల హామీల వ్యాపారం కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విత్తనాలు అమ్మే ముందు కంపెనీలకు రైతులు గుర్తొస్తారు.. పంట చేతికొచ్చాక అదే రైతులు ఎందుకు గుర్తుకురావడం లేదు? గతేడాది బకాయిలు తేల్చకుండా ఈ ఏడాది మళ్లీ విత్తనాల పంపిణీకి తెరలేపిన కంపెనీలపై వ్యవసాయ శాఖ విచారణ చేపడుతుందా? లేక రైతన్న మరోసారి ఏజెంట్ల హామీలకు బలవుతాడా? ఏన్మూరు మండల రైతులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత కంపెనీలు, వ్యవసాయ శాఖ అధికారులపై ఉంది.

జర్నలిస్టుల వినతికి సానుకూలంగా స్పందించిన ఇల్లందు డిపో మేనేజర్

- నెల్లికుదురు,ఆలేరు స్టేజీల వద్ద ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు హాల్టింగ్ కల్పించాలని వినతి





తొలిఅక్షరం/నెల్లికుదురు నవంబర్ 13: నెల్లికుదురు మండల ప్రయాణికుల సౌకర్యార్థం జర్నలిస్టులు చేసిన విజ్ఞప్తికి ఇల్లందు డిపో మేనేజర్ శుభాషిణి సానుకూలంగా స్పందించారు. ఇల్లందు డిపో నుంచి నెల్లికుదురు మండల కేంద్రం మీదుగా హైదరాబాద్‌లోని మియాపూర్‌కు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సుకు నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు ఆలేరు స్టేజీ వద్ద హాల్టింగ్ కల్పించాలని జర్నలిస్టులు కోరారు.సామాజిక కార్యకర్త,సీనియర్ జర్నలిస్ట్ బొడ్డు అశోక్ నేతృత్వంలో సీనియర్ జర్నలిస్టులు చందా శ్రీనివాస్,గొడుగు శ్రీనివాస్ గౌడ్ కలిసి శుక్రవారం ఇల్లందు డిపో మేనేజర్ శుభాషిణిని కలిసి ప్రయాణికుల సమస్యను వివరించి వినతిపత్రం అందించారు.ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలకు,ముఖ్యంగా నెల్లికుదురు మండల కేంద్రం,ఆలేరు స్టేజీ పరిసర ప్రాంతాల ప్రయాణికులకు ఎక్స్‌ప్రెస్ బస్సు నిలుపుదల లేకపోవడం వల్ల సాయంత్రం హైదరాబాద్ కు వెళ్లేజవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు వివరించారు. ఆయా ప్రాంతాల్లో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలుగుతుందని విజ్ఞప్తి చేశారు.జర్నలిస్టుల వినతిపై డిపో మేనేజర్ శుభాషిణి సానుకూలంగా స్పందించినట్లు అశోక్ తెలిపారు.ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంలో జర్నలిస్టులు చూపిన చొరవను పలువురు అభినందిస్తున్నారు.

బాలాజీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన డిసిసి అధ్యక్షురాలు ఉమామురళి నాయక్



తొలిఅక్షరం/నెల్లికుదురు నవంబర్ 13: నెల్లికుదురు మండల కేంద్రంలోని రత్తిరాం తండాకు చెందినటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలాజీ నాయక్ తండ్రి మరణించడంతో నిన్న వారి యొక్క కుటుంబాన్ని పరామర్శించి వారి యొక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన డిసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, డీసీసీ మాజీ అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్, పరామర్శించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ మరియు కాంగ్రెస్ ప్రభుత్వం బాలాజీ నాయక్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటాయని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, పలు మండలాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై దాడిని ఖండించిన సతీష్ నాయి



తొలి అక్షరం/చౌటుప్పల్ నవంబర్ 13: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల పరిధిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నపై జరిగిన హత్యాయత్నాన్ని ఆ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి సికీలమెట్ల సతీష్ నాయి తీవ్రంగా ఖండించారు. బహుజనుల హక్కులు, బీసీల రాజ్యాధికార సాధన కోసం పోరాడుతున్న నాయకులపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని అన్నారు. ఇలాంటి దాడులతో బీసీల ఆత్మగౌరవ పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తీన్మార్ మల్లన్నకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

తీన్మార్ మల్లన్న కారు ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలి

- **హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.. టీఆర్పీ షాద్‌నగర్ ఇన్‌చార్జి ఎమ్మె సంతోష్ డిమాండ్**



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 13: తీన్మార్ మల్లన్న కారును లారీ ఢీకొన్న ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టీఆర్పీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మె సంతోష్ అన్నారు. ఈ ప్రమాదంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లోని టీఆర్పీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోత్కూర్ నుంచి తిరుమలగిరికి మహా పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో అనాజీపూర్ వద్ద వేగంగా వచ్చిన లారీ మల్లన్న ఫార్చునర్ కారును వెనుక నుంచి ఢీకొట్టిందన్నారు. ముందు వెళ్తున్న మరో రెండు కార్లు కూడా ప్రమాదానికి గురయ్యాయని, వాటిలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ నల్లటి కారులో పారిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారని పేర్కొన్నారు. ఈ ఘటనలో కుట్ర కోణం ఉందనే అనుమానాలు ఉన్నాయని, వాటిని విచారణ ద్వారా నివృత్తి చేయాలని కోరారు. మల్లన్న పాదయాత్రకు, నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గుల్ల లక్ష్మి, నాయకులు రాధాకృష్ణ, గుంటి శంకర్, గుల్ల శ్రీనివాస్, ఉప్పరమొని రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బాల్యవివాహాలు, పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 13: విద్యార్థుల భద్రత, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా షాద్‌నగర్ పోలీసులు ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై విద్యార్థులకు వివరించారు. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన పరిణామాలను తెలియజేస్తూ, ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా, వేధింపులకు గురైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌ల భద్రతపై అవగాహన కల్పించారు. అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దని, సైబర్ నేరాల బారిన పడితే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు కోరారు.





దసురు నాయక్ చిత్రపటానికి మాదిగ సంఘాల నివాళి

తొలి అక్షరం/నెల్లికుదురు, నవంబర్ 13:నెల్లికుదురు మండలం రత్తిరామ్ తండాకు చెందిన డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు గుగులోత్ బాలాజీ నాయక్ తండ్రి గుగులోతు దసురు నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ విద్యార్థి శక్తి నాయకులు శుక్రవారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దసురు నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో తుళ్ల వెంకన్న మాదిగ, కడారి ఐలయ్య మాదిగ, హెచ్. మహేందర్, హెచ్. రవి మాదిగ, తుళ్ల చిన్న వెంకన్న మాదిగ, హెచ్. అశోక్ మాదిగ, తుళ్ల వివేక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో నూతన చేయూత పింఛన్ల పంపిణీ

- పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం




తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 13: కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం షాద్ నగర్ పట్టణంలోని 27వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ అగనూరు బసవేశ్వర్, 27వ వార్డు కౌన్సిలర్ మురళి మోహన్ (అప్పి), కాలనీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మంగ అశోక్ ముదిరాజ్ చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయని నాయకులు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తోందని పేర్కొన్నారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలకు పింఛన్లు ఎంతో ఆసరాగా నిలుస్తాయని తెలిపారు. కాలనీ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్ల భరోసా

● గిరిజన కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి కానుక ● ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం ● గౌరికుంట తండాలో గృహప్రవేశానికి ఎమ్మెల్యే శంకర్



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 13: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడ్ గ్రామపంచాయతీ పరిధిలోని గౌరికుంట తండాలో నిరుపేద గిరిజన మహిళ అరుణ రాజు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారురాలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గానికి తొలి విడతలో 3,500, రెండో విడతలో మరో 1,500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని వెల్లడించారు. చించోడ్ గ్రామానికి 47, గౌరికుంట తండాకు మూడు ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన పేదలు, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రేషన్ కార్డులు, సన్నబియ్యం, పింఛన్లు వంటి పథకాలను అమలు చేస్తూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26వ వార్డులో నూతన చేయూత, వికలాంగుల పింఛన్ల పంపిణీ

● అర్హులకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 13: ప్రభుత్వం పేదలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న ఇందిరమ్మ చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం షాద్‌నగర్ పట్టణంలోని 26వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు మున్సిపల్ చైర్మన్ అగనూరు బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీత, 26వ వార్డు కౌన్సిలర్ ఎస్పీ శివ చేతుల మీదుగా వికలాంగుల పెన్షన్ల,చేయూత పింఛన్ల అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో అర్హులకు పింఛన్లు మంజూరయ్యాయని నాయకులు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతనంగా పింఛన్లు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఉత్తరాసుపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం






తొలి అక్షరం/కొండుర్గు, నవంబర్ 13: కొందుర్గు మండలం ఉత్తరాసుపల్లి గ్రామంలో దొడ్వల్లి పావనిశేఖర్ దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి గృహప్రవేశం చేశారు.ఈ సందర్భంగా కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోగురి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. అనంతరం పావనిశేఖర్ దంపతులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గోవర్ధన్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు అంజిరెడ్డి, మల్లేష్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రామరాజు, నాయకులు పొట్ట శివకుమార్, వార్డు సభ్యులు కమ్మరి రాజు, మల్లేష్, గణేష్, రవి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోనియా గాంధీ ఆత్మకథ పుస్తకం అందుకోవడం ఆనందంగా ఉంది

- కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 13: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ రచించిన 'బిలోంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' (BELONGING: A JOURNEY OF LOVE) పుస్తకం తన చేతికి చేరడం ఎంతో ఆనందంగా ఉందని కేశంపేట మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ పుస్తకం కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నానని, ఎట్టకేలకు అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. సోనియా గాంధీ వ్యక్తిగత జీవిత ప్రయాణం, కుటుంబ అనుబంధాలు, భారతదేశంతో ఆమెకు ఉన్న విడదీయలేని బంధం గురించి తెలుసుకునేందుకు ఈ పుస్తకం చక్కని అవకాశమని పేర్కొన్నారు. ప్రేమ, త్యాగం, సహనం, పట్టుదల, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం వంటి విలువైన జీవిత పాఠాలు ఇందులో ఉన్నాయని అభిప్రాయపడ్డారు. పుస్తకంలోని ప్రతి పేజీ స్ఫూర్తినిస్తుందని, పఠనం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు విశాల శ్రవణ్ రెడ్డి తెలిపారు.

అభివృద్ధికి అడ్డుపడితే సహించేది లేదు

పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులకు రూ.7 కోట్లు మంజూరు





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 13: పేద ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు అడ్డుపడితే సహించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరమ్మ చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.గతంలో పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అర్హుల ఇళ్ల వద్దకే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కోసం రూ.7 కోట్లు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. త్వరలో రూ.5 లక్షల ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం కానుందని తెలిపారు. అర్హులైన పేదలకు ఇళ్లతో పాటు సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంగెంలో 50 ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

- భూగర్భ జలాల పెంపే లక్ష్యం: సర్పంచ్ వేణుగోపాల్ చారి



తొలి అక్షరం/కేశంపేట, నవంబర్ 13: కేశంపేట మండలం సంగెం గ్రామంలో భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ లక్ష్యంగా 50 ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. శుక్రవారం సర్పంచ్ గన్నోజు వేణుగోపాల్ చారి, ఎంపీడీవో రవిచంద్ర రెడ్డితో కలిసి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టడం ద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించవచ్చన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతలు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నీటి సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


చిన్నారుల సృజనాత్మకతకు అరుదైన వేదిక

- ఘనంగా ఓరుగల్లు చిల్డ్రన్స్ అవార్డు పోస్టర్ ను ఆవిష్కరించిన..ఈగ మల్లేశం





తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: హన్మకొండ పట్టణం బాలసముద్రంలోని ఎన్టీఆర్ ప్రాంగణంలో జే.బి కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ నిర్వహిస్తున్న సకల కళల సంబరాల జాతరలో భాగంగా చాచా నెహ్రూ జయంతి,బాలల దినోత్సవం పురస్కరించుకుని పబ్లిక్ గార్డెన్ లోని పద్మశ్రీ డావ నేరెళ్ళ వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ఈనెల 15వ తేదీన జరగనున్న ఓరుగల్లు చిల్డ్రన్స్ అవార్డు – 2026 పోస్టర్ ను ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షులు,కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేటి బాలలే రేపటి కళాకారులని చిన్నారులలో దాగి ఉన్న సృజనాత్మకతను,కళా నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు.గత 23 సంవత్సరాలుగా నిరంతరాయంగా బాలల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తూ చిన్నారులను ప్రోత్సహిస్తున్న సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జడల శివ కృషి ఎంతో అభినందనీయమని అన్నారు.ఈ నెల 15వ తేదీన జరగనున్న ఈ వేడుకల్లో బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలి అని పిలుపునిచ్చారు.ఈ అవార్డ్స్ కార్యక్రమం ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాలబాలికలు,గురువులు,తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో జడల శివ,హరిత,ఎం.చంద్రమౌళి,హిందీ శ్యామ్,పి.భుజంగరావు,పిట్టల జ్యోత్స్న,రాయబారపు ప్రసాద్,ఎం.చందన,సంపత్ రావు,సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు...

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఐనవోలు మండలం వనమాలకనపర్తికి చెందిన ముత్తినేని రజిత రాజుల కుమార్తె ప్రేమలత, అఖిల్ పటేల్ వివాహం మడికొండలోని శ్రీ రాజరాజేశ్వర గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. అలాగే ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో బొల్లేన నీలమ్మ, భిక్షపతి కుమార్తె దివ్య వివాహం, మామునూరుకు చెందిన అనుముల వనమాల మల్లారెడ్డి కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి వివాహ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ సిలువేరు శ్రీనివాస్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రబీ సాగు ప్రణాళిక, విద్యా ప్రమాణాల పెంపునకు ప్రాధాన్యత

- భూసేకరణ పనులు వేగవంతం చేయాలి: సీఎస్ సంజయ్ జాజు



తొలి అక్షరం/రంగారెడ్డి, నవంబర్ 13: రాబోయే రబీ సీజన్‌కు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై సమీక్షించారు.రైతు నమోదు, రాయితీ విత్తనాల పంపిణీ, పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ సేద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంచడంతో పాటు డిజిటల్ విద్యాబోధనను విస్తరించాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో విద్యార్థుల హాజరు 72.21 శాతంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు.వీధి కుక్కల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమలు చేయాలని, జాతీయ రహదారుల భూసేకరణ, పరిహారం పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు ప్రభుత్వ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌సీఓఎఫ్ కొనుగోలు విధానాన్ని రద్దు చేయాలి: ఏఐఎస్ఎఫ్



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాసిరకం సరుకులు సరఫరా చేస్తూ, పౌష్టికాహార మెనూలో కోతలు విధిస్తున్న ఎన్ఎస్-సీఓఎఫ్ కేంద్ర కొనుగోలు విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగా జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ద్వారా నాణ్యమైన సరుకులను తక్కువ ధరలకు కొనుగోలు చేసే విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. తగ్గించిన గుడ్లు, అరటిపండ్లు, చికెన్ మెనూను తిరిగి అమలు చేయాలని, సరుకుల నాణ్యత, ధరలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌కు ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని సంతోష్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, మల్లెబోయిన రామ్ చరణ్, కస్తూరి పవన్ చారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం: ఎమ్మెల్యే నాయిని

రూ.2.33 కోట్లతో మూడు డివిజన్లలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్, 63వ డివిజన్ తిలక్‌నగర్, 8వ డివిజన్ మర్మజీ స్కూల్ ఆవరణలో సుమారు రూ.2.33 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి అంటే జీవోలు, పత్రికా ప్రకటనలకే పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో పనులు చేసి చూపించడమేనన్నారు. పనులను నిర్ణీత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.550 కోట్లతో తాగునీటి పైప్‌లైన్ విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, విమానాశ్రయం వంటి కీలక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ప్రభుత్వ పనులపై నిధుల వివరాలతో చర్చించేందుకు సిద్ధమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆజిజ్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కాళోజీది ధిక్కార స్వరం: పులి రజినీకాంత్



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయం బాలసముద్రంలో కాళోజీ నారాయణరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.కాళోజీది ధిక్కార స్వరం అని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ అన్నారు.కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రజా కవి కాళోజీ నారాయణరావు జీవిత చరిత్ర,ఆయన తెలుగు ప్రాముఖ్యతను వివరించిన తీరు అమోఘమని,ఆయన తెలుగు భాషకు ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు.ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.తెలంగాణ ఉద్యమం,తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్య పరచారని కొనియాడారు.తుది శ్వాస వరకు కూడా సమాజ శ్రేయస్సు కోసం తెలంగాణ ప్రాంత అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు.కేసీఆర్ కాళోజీ నారాయణరావు పేరిట విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఉడుతల సారంగపాణి,మేకల బాబు రావు,నాయకులు ఇమ్మడి రాజు,చిన్న.మూటిక రాజు,అభిలాష్,కోటేశ్వర్,మహేందర్,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు

షాద్‌నగర్‌లో నేడు నాలుగు గంటలు విద్యుత్ బంద్

- మరమ్మతు పనులతో పలు కాలనీలకు కరెంట్ కట్
- 11 కేవీ ఫీడర్ పనులు.. విద్యుత్ సరఫరాకు అంతరాయం
- షాద్‌నగర్ ప్రజలకు విద్యుత్ శాఖ కీలక ప్రకటన



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 13: షాద్‌నగర్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 11 కేవీ షాద్‌నగర్ టౌన్ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ అంతరాయం కారణంగా షాద్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని మెయిన్ రోడ్, ఎంబీఎన్ఆర్ రోడ్, ఆశా కాలనీ, పోలీస్ స్టేషన్ ప్రాంతం, గాంధీనగర్ కాలనీ, లక్ష్మీనరసింహ కాలనీ, ఇందిరానగర్ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. మరమ్మతు పనుల సమయంలో మధ్యమధ్యలో కూడా విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, మెరుగైన సరఫరా కోసమే ఈ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కావున ఆయా ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ శాఖకు సహకరించాలని షాద్‌నగర్ టౌన్ ఏఈ జి. వినోద్ కోరారు.

కంటైనర్ ఢీకొని మహిళ దుర్మరణం.. భర్తకు గాయాలు

- కొందుర్గు బస్టాండ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- జకారం గ్రామానికి చెందిన కుమ్మరి సుగుణమ్మ మృతి



తొలి అక్షరం/కొందుర్గు, నవంబర్ 13: కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కంటైనర్ వాహనం స్కూటీని ఢీకొట్టడంతో స్కూటీపై ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో ఆమె భర్తకు గాయాలైనట్లు సమాచారం.వివరాల్లోకి వెళితే.. కొందుర్గు నుంచి జకారం గ్రామానికి భార్యాభర్తలు స్కూటీపై వెళ్తుండగా కొందుర్గు బస్టాండ్ సమీపంలో కంటైనర్ వాహనం వారి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు స్కూటీపై ఉన్న భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో జకారం గ్రామానికి చెందిన కుమ్మరి సుగుణమ్మ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమె భర్తకు గాయాలయ్యాయి.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. సుగుణమ్మ మృతితో జకారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒకే ప్రమాదంలో కుటుంబ సభ్యురాలిని కోల్పోవడంతో గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

జినీకాంత్,వెంకటేష్ జన్మదినోత్సవం సందర్భంగా పురస్కారాలు

- నవంబర్ 30లోగా దరఖాస్తులకు ఆహ్వానం

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి పి సైదులు),నవంబర్13: సూపర్ స్టార్ రజినీకాంత్,విక్టరీ వెంకటేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలూరి కల్చరల్ & సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ సైఫాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జరగనున్న ఈ వేడుకల్లో సినీ ప్రముఖులు, కళాకారులు,సంఘ సేవకులు,గాయనీ గాయకులకు ఐకాన్, టాలెంట్,ఎక్సలెన్స్ అవార్డులను అందజేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఇంటి పేరు,పేరు, వృత్తి, అనుభవం వివరాలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటోను 30వ తేదీలోగా 9494861669 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని నిర్వాహకులు కోరారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్

తొర్రూరు పోలీసుల అదుపులో నిందితులు
వైద్య పరీక్షల్లో గంజాయి వినియోగం నిర్ధారణ



తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబపస్తం) నవంబర్ 13: తొర్రూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టుబడిన వారిలో ఒకరు కొమ్మనపల్లి తండాకు చెందిన వ్యక్తి కాగా, మరో ఇద్దరు తొర్రూరు పట్టణానికి చెందినవారు. అనుమానాస్పదంగా కనిపించిన వీరిని అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించగా, గంజాయి సేవించినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయిని కలిగి ఉండటం, విక్రయించడం, సేవించడం చట్టరీత్యా తీవ్ర నేరమని ఎస్ఐ స్పష్టం చేశారు. యువత మత్తుపదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వర్క్‌షాప్‌లు









- అకౌంటెంట్ జనరల్ నావల్ కిషోర్
- ఉమ్మడి జిల్లా పెన్షన్, జీపీఎఫ్ అదాలత్, వర్క్ షాప్ లో పాల్గొన్న అకౌంటెంట్ జనరల్

తొలి అక్షరం/ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 : ఉద్యోగుల పెన్షన్, జీపీఎఫ్, ఇతర సర్వీస్ సంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లాల వారీగా ప్రత్యేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నట్లు అకౌంటెంట్ జనరల్ వి.ఎం.వి. నావల్ కిషోర్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పెన్షన్, జీపీఎఫ్ అదాలత్, వర్క్‌షాప్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా నావల్ కిషోర్ మాట్లాడుతూ పెన్షన్ ఆమోదం, జీపీఎఫ్ దరఖాస్తులు, ఆర్థిక ఖాతాలకు సంబంధించిన ప్రక్రియల్లో ఖచ్చితత్వం అవసరమన్నారు. పదవీ విరమణకు ముందే ఉద్యోగుల దరఖాస్తులు సరైన వివరాలతో, నిర్ణీత సమయంలో సంబంధిత కార్యాలయాల ద్వారా అందించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనలపై వివిధ కార్యాలయాల్లో నెలకొనే భిన్నాభిప్రాయాలను నివృత్తి చేసి, స్పష్టమైన మార్గదర్శకాలు అందించడమే వర్క్‌షాప్‌ల ప్రధాన ఉద్దేశమన్నారు. ట్రెజరీల పనితీరును మెరుగుపరిచేందుకు తనిఖీలు, ఆడిట్ సూచనలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపుతామని పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘకాలం ప్రభుత్వ సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెన్షన్, జీపీఎఫ్, బిల్లుల ఆమోదంలో ఎదురయ్యే ఇబ్బందులను వర్క్‌షాప్‌ల ద్వారా అధిగమించవచ్చన్నారు. నిబంధనలపై స్పష్టత పొందేందుకు డీడీవోలు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ ఎం. నరేష్ కుమార్, కె. శశిధర్, ఖమ్మం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ వై. శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ జె. మీనాక్షి, ఖమ్మం పీఏఓ రామ్, ఉభయ జిల్లాల అధికారులు, ఉప కోశాధికారులు, ట్రెజరీ సిబ్బంది పాల్గొన్నారు.



తెలుగు ఆడియన్స్ పల్స్ పట్టేసిన దుల్కర్..

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగు.. ప్రేక్షకులకు బాగా దగ్గరవుతున్నారు. కొంతమంది తెలుగు హీరోల కన్నా కూడా ఈయనకి అభిమానులు ఎక్కువగా ఉండటం విశేషం. అయితే దీనికి కారణం కేవలం సినిమాలు మాత్రమే కాదు. ఆయన ఎంచుకునే కథలు, పాత్రలు, అభిమానులతో మెలిగే విధానం కూడా అయింది తెలుగు ప్రేక్షకులకు ఎక్కువ దగ్గర చేస్తున్నాయి. సాధారణంగా ఒక భాషకు చెందిన హీరో మరో భాషలో గుర్తింపు తెచ్చుకోవాలంటే అక్కడి ప్రేక్షకులకు చాలా దగ్గర అవ్వాలి. వారి అభిరుచులకు తగ్గ సినిమాలు చేయడంతో పాటు, సినిమా ప్రమోషన్లకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ విషయం దుల్కర్ సల్మాన్ బాగా అర్థం చేసుకున్నారు. తెలుగు సినిమాలు చేస్తున్నప్పటి నుంచే ఇక్కడి ప్రేక్షకులతో అనుబంధాన్ని పెంచుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నారు. ఇంటర్వ్యూలలో తెలుగులో మాట్లాడుతూ ఉండడం.. సినిమా ప్రమోషన్లలో చురుగ్గా పాల్గొనడం ఆయనకు మరింత ప్లస్ అవుతోంది. మరోవైపు దుల్కర్ సల్మాన్ తీసే సినిమాలు కూడా.. ఆయనకు పాపులారిటీ పెంచుతూనే వస్తున్నాయి . హీరో అంటే భారీ యాక్షన్ సన్నివేశాలు, ఎలివేషన్లు ఉండాలనే లెక్కలకు దుల్కర్ ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వరు. కథలో తన పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంది, ఆ పాత్ర ప్రేక్షకుల మనసుల్లో ఎంతకాలం నిలిచిపోతుంది అనే విషయాలపై దృష్టి పెడతారు. అందుకే మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి విభిన్నమైన సినిమాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు ఆకాశంలో ఒక తార సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. నవంబర్ 20న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా కూడా చాలావరకు.. దుల్కర్ సల్మాన్ గత తెలుగు సినిమాల లాగానే.. కంటెంట్ చాలా స్ట్రాంగ్ గా ఉండేలా కనిపిస్తోంది. నిజానికి మరో భాషలో స్టార్‌డమ్ సంపాదించడం అంత సులభం కాదు. కానీ దుల్కర్ తన సినిమా సెలక్షన్, తన ప్రమోషన్ స్ట్రాటజీ ద్వారా.. ఈ విషయాన్ని తేలిక గానే చేసేసారు. ఇక ఇదే విషయం మన తెలుగు హీరోలు కూడా దుల్కర్ సల్మాన్ దగ్గర నుంచి నేర్చుకోవడం చాలా అవసరం.

అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డికి అరుదైన గౌరవం

'బౌలీ ఆర్ట్ సంఘం' చైర్‌పర్సన్‌గా అల్లు స్నేహారెడ్డి నియామకం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భార్య, వ్యాపారవేత్త అల్లు స్నేహారెడ్డికి కళా, సాంస్కృతిక రంగాల్లో అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్టాత్మక 'బౌలీ ఆర్ట్ సంఘం' కల్చర్ అండ్ హెరిటేజ్ విభాగానికి ఫౌండింగ్ చైర్‌పర్సన్‌గా ఆమె నియమితులయ్యారు. భారతదేశంలోనే మొట్టమొదటి 'స్టెప్‌వెల్ ఆర్ట్ బినాలే'గా గుర్తింపు పొందిన ఈ ఉద్యమానికి ఆమె ప్రధాన సారథిగా వ్యవహరించనున్నారు.

దక్కన్ ప్రాంతంలో, ముఖ్యంగా హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న పురాతన మెట్ల బావుల (బావోలీలు) చారిత్రక, పర్యావరణ విశిష్టతను నేటి తరానికి చాటిచెప్పడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. 'ది రెయిన్‌వాటర్ ప్రాజెక్ట్'కు చెందిన కల్పనా రమేశ్, 'ఏక్ చిత్ర'కు చెందిన అన్నపూర్ణ మాదిపాడిగ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. ఈ పురాతన బావులను కళా వేదికలుగా తీర్చిదిద్ది ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్నేహారెడ్డిని ఈ ప్రాజెక్ట్ ముఖచిత్రంగా ఎంపిక చేశారు.

ఈ క్రమంలో డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 10 వరకు దాదాపు 40 రోజుల పాటు భారీ స్థాయిలో బౌలీ ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. బన్సీలాల్‌పేట్, గోల్కొండ, రాష్ట్రపతి నిలయం, ఫలక్‌నుమా తదితర 13కు పైగా చారిత్రక ప్రాంతాల్లో 200 మందికి పైగా కళాకారులతో ప్రదర్శనలు, చర్చలు ఏర్పాటు చేయనున్నారు.ఈ బాధ్యతలపై స్నేహారెడ్డి స్పందిస్తూ... "బౌలీ ఆర్ట్ సంఘంలో ఈ కొత్త బాధ్యత చేపట్టడం చాలా సంతోషంగా ఉంది. మన నగరం యొక్క చరిత్ర, వారసత్వ సంపదపై ముఖ్యంగా యువతరంలో మరింత అవగాహన పెంచేందుకు ఈ ప్రాజెక్ట్ ఒక గొప్ప వేదికగా నిలుస్తుంది. భావితరాల కోసం మన సంస్కృతిని కాపాడే దిశగా ఇది ఒక అర్థవంతమైన అడుగు" అని పేర్కొన్నారు.

క్యాన్సర్‌ను జయించిన మోనాల్ గజ్జర్

సర్జరీ తర్వాత ఎమోషనల్ పోస్ట్!



సినిమా తారల జీవితాలు బయటకు ఎంతో అందంగా కనిపిస్తాయి. కానీ కెమెరా వెనుక వారు ఎదుర్కొనే వ్యక్తిగత సమస్యలు.. ఆరోగ్య ఇబ్బందులు చాలామందికి తెలియవు. తాజాగా టాలీవుడ్ నటి.. బిగ్‌బాస్ ఫేమ్ మోనాల్ గజ్జర్ తన ఆరోగ్యానికి సంబంధించిన విషయాన్ని వెల్లడించి అభిమానులను షాక్‌కు గురిచేశారు. తనకు పాపిల్లరీ థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలిందని.. ఈ మధ్యనే శస్త్రచికిత్స చేయించుకున్నట్లు ఆమె సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం సర్జరీ విజయవంతంగా పూర్తయిందని..క్రమంగా కోలుకుంటున్నానని తెలిపారు.ూశ్రీంశీ =ష్ణఎ – రాజమౌళి ఆలోచన సరైనదేనా? మోనాల్ గజ్జర్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. అల్లరి నరేష్ హీరోగా నటించిన సుడిగాడు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆమె, ఆ తర్వాత బ్రదర్ ఆఫ్ బొమ్మాలి వంటి చిత్రాల్లోనూ నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. సినిమాలతో పాటు టెలివిజన్ రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా తెలుగు బిగ్‌బాస్ సీజన్ 4లో పాల్గొనడంతో ఆమెకు మరింత పాపులారిటీ వచ్చింది. ఈ షో ద్వారా బుల్లితెర ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు. అనంతరం బెల్లంకొండ శ్రీనివాస్ నటించిన అల్లుడు అదుర్స్ సినిమాలో ఒక ఐటమ్ సాంగ్లో కనిపించి అలరించారు. అయితే తాజాగా ఆమె పంచుకున్న ఆరోగ్య సమాచారం మాత్రం అభిమానులను కలచివేసింది. తనకు పాపిల్లరీ థైరాయిడ్ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించడంతో వైద్యుల సలహా మేరకు ఆపరేషన్ చేయించుకున్నట్లు మోనాల్ తెలిపారు. ఈ సమస్యను ఎదుర్కొని ప్రస్తుతం కోలుకుంటున్నానని చెప్పడం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. తన ఆరోగ్య పరిస్థితి గురించి బహిరంగంగా మాట్లాడటం ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించే ప్రయత్నం కూడా చేశారు. ఈ క్రమంలో ఈ నటి..జీవితంలో కెరీర్, కుటుంబం, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. శరీరంలో ఏవైనా అసాధారణ మార్పులు కనిపించినా, ఆరోగ్యంపై సందేహాలు ఉన్నా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని కోరారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా ఎంతో అవసరమని గుర్తుచేశారు. అంతేకాదు, మహిళల్లో క్యాన్సర్ నివారణపై అవగాహన పెంచేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ ప్రాముఖ్యతను కూడా ప్రస్తావించారు. ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్ నివారణకు సంబంధించి సరైన వైద్య సలహా తీసుకోవాలని తెలిపింది. ఆమె చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.


కంగనా రనౌత్ 'స్కేరీ పిక్చర్' టైటిల్ పోస్టర్ విడుదల చేసిన రానా దగ్గుబాటి.. బాలీవుడ్ లో రవిబాబు ఎంట్రీ



బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న హారర్ చిత్రం 'స్కేరీ పిక్చర్'. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి ఈరోజు అధికారికంగా విడుదల చేశారు. సురేష్ ప్రొడక్షన్స్, ఫ్లయింగ్ ఫ్రాగ్స్, స్పిరిట్ మీడియా పతాకాలపై దగ్గుబాటి సురేష్ బాబు, రవిబాబు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

తెలుగులో 'అనసూయ', 'అవును' వంటి విభిన్నమైన హారర్ థ్రిల్లర్లతో మెప్పించిన దర్శకుడు రవిబాబు, ఈ సినిమా ద్వారా హిందీ చిత్రసీమలోకి దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రానా దగ్గుబాటి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా ఈ టైటిల్ పోస్టర్‌ను పంచుకుంటూ... "ఒక కొత్త పీడకల మొదలుకాబోతోంది" అని పేర్కొన్నారు.భారతదేశంలో హారర్ కథలకు మంచి ఆదరణ ఉందని, దేశంలోని విభిన్న ప్రాంతాల భయాలు, కథలను వెండితెరపైకి తెచ్చే దర్శకులకు సురేష్ ప్రొడక్షన్స్, స్పిరిట్ మీడియా ద్వారా నిరంతర మద్దతు అందిస్తామని రానా తెలిపారు. సైకలాజికల్, క్రీచర్, హారర్-కామెడీ వంటి అన్ని రకాల సబ్-జోనర్లను ప్రోత్సహించేలా ఒక ప్రత్యేక వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు.గతంలో 'రాజ్: ది మిస్టరీ కంటిన్యూస్', 'చంద్రముఖి 2' వంటి చిత్రాలలో నటించిన కంగనా రనౌత్, మరోసారి ఈ పూర్తి స్థాయి హారర్ చిత్రంతో ప్రేక్షకులను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాను 2027లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం స్పష్టం చేసింది. పూర్తి తారాగణం, విడుదల తేదీకి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడించనున్నారు.

ఏకంగా 22 కిలోల బరువు తగ్గిన కీరవాణి ఎక్స్‌లో పంచుకున్న అనుపమ్ ఖేర్



ఆస్కార్ విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి శారీరకంగా పూర్తిగా మారిపోయాడు. ఏకంగా 22 కిలోల బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచాడు. తాజాగా హైదరాబాద్‌లో ఆయనను కలిసిన బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ ఈ మార్పును చూసి ఫిదా అయ్యాడు. కీరవాణి పట్టుదల, క్రమశిక్షణ నిజంగా స్ఫూర్తిదాయకమంటూ ప్రశంసలు కురిపించాడు. బరువు తగ్గిన తర్వాత ఆయన మరింత ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్నాడని కొనియాడాడు.హైదరాబాద్ పర్యటనలో కీరవాణిని కలిసిన అనుపమ్ ఖేర్.. ఆ సందర్భానికి సంబంధించిన కొన్ని ఫొటోలను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నాడు. కీరవాణి 22 కిలోల బరువు తగ్గడం అద్భుతమైన విషయమని పేర్కొన్నాడు. ఆయన నడకలోనూ కొత్త ఉత్సాహం కనిపించిందని, ఎంతో సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నాడని తెలిపాడు. సంగీతంలో అద్భుతాలు సృష్టించిన కీరవాణి.. ఇప్పుడు పట్టుదల, ఏకాగ్రతతో ఏదైనా సాధించవచ్చని నిరూపించాడని ప్రశంసించాడు. ఆయన జీవితంలో ప్రారంభమైన ఈ కొత్త ప్రయాణం మరింత విజయవంతం కావాలని ఆకాంక్షించాడు.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386,Gmail: tholiaksharam@gmail.com , Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.